## క్లుప్తంగా

### కలెక్టరేట్ ఎదుట ధర్నా

**భూపాలపల్లి అర్బన్:** రాష్ట్రంలో విద్య వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ (ఏబీవీపీ) గుజ్జుల ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యాశాఖ నిర్వీర్యమైందని ఆరోపించారు. గడిచిన ప్రభుత్వాలు మారినా విద్యార్థుల బతుకులు మారలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందడం లేదని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవితేజ, కృష్ణ, సుశాంత్, శశి, సన్నీ, రంజిత్, నరేష్ పాల్గొన్నారు.

### దరఖాస్తుల స్వీకరణ

**భూపాలపల్లి అర్బన్:** జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. కనీసం 10 సంవత్సరాల సర్వీస్ కలిగి ఉండాలన్నారు. వివరాలకు నేషనల్ అవార్డ్స్ ఫర్ టీచర్స్–2023 వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఐఎన్‌టీయూసీలో చేరిక



**భూపాలపల్లి అర్బన్:** టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు బత్తుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 50మంది కార్మికులు సోమవారం ఐఎన్‌టీయూసీలో చేరినట్లు సంఘం యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య తెలిపారు. యూనియన్ కార్యాలయంలో చేరిక కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. యూనియన్‌లో చేరిన వారికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వేణుగోపాల్, సదయ్య, రాజేష్, శేషరత్నం పాల్గొన్నారు.

### 'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ

**భూపాలపల్లి రూరల్:** రైతు భరోసా పథకం అమలు తీరుపై జంగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాయంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ హాజరై రైతుల సలహాలు సూచనలు స్వీకరించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. 20 ఎకరాల వరకు రైతుభరోసా పథకం అమలు చేయాలని కొందరు, ఐదు ఎకరాల వరకు ఇవ్వాలని, కౌలు రైతుకి ఇవ్వాలని, సాగు చేసే ప్రతి గుంటకు రైతుభరోసా పథకం అమలు చేయాలని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు 'పీఏసీఎస్' సమావేశం

**మహాముత్తారం:** మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం రైతుభరోసా పథకంపై ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ మార్క శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంఘ సభ్యులు, రైతులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

### నేడు సర్వసభ్య సమావేశం

**పలిమెల:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు (మంగళవారం) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

### అవగాహన సదస్సు



**మహాముత్తారం:** నీతి అయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పలు శాఖల అధికారులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొమ్మిది అంశాలపై సంపూర్ణత అభ్యున్నత కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, మండల వైద్యాధికారి సందీప్‌రావు, వ్యావసాయ అధికారి సతీష్, పీఆర్ఏఈ రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మల్హర్: దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ రవికుమార్



మహాముత్తారం: దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్



కాళేశ్వరం: దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్

# సమస్యల పరిష్కారానికి కృషి

**టేకుమట్ల:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ అనిత అన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు పలు సమస్యలలపై దరఖాస్తులను సమర్పించారు. 12 దరఖాస్తులను వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్‌కుమార్, ఎంపీఓ సురేష్, ఏపీఓ మాధవి, జూనియర్ అసిస్టెంట్లు బాబు, కుమార్, తదితరులు ఉన్నారు.

**మల్హర్:** మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యాక్రమానికి వివిధ గ్రామాల నుంచి 8 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కారమయ్యే విధంగా కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు.

**మహాముత్తారం:** మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. భూ సమస్యలపై నాలుగు దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల ప్రజలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



టేకుమట్ల: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

#### ప్రజావాణికి 51 దరఖాస్తులు

**కాళేశ్వరం:** మహదేవపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండలం పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భూ సంబంధిత సమస్యలపై 51 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్ తెలిపారు. ఆయన వెంట డీటీ కృష్ణ ,ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యలక్ష్మీ, బాలరాజు తదితరులు ఉన్నారు.

#### రైతుల సమస్యలను పరిష్కరిస్తాం..

**చిట్యాల:** మండలంలోని పలు గ్రామాల్లో ఇంత వరకు పరిష్కారం కాని భూ సమస్యలను పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ ఖాజామోహీయుద్దీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 16 మంది రైతులు సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించి వారం రోజులలో పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**రేగొండ(కొత్తపల్లిగోరి):** ప్రజల సమస్యలను సత్వర పరిష్కార దిశగా మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్‌లు సత్యనారాయణ స్వామి, వీరభద్రం తెలిపారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రాలలోని తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. రేగొండలో 42, కొత్తపల్లిగోరిలో 46 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రజాక్, జూనియర్ అసిస్టెంట్‌లు వేణు, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**మొగుళ్లపల్లి:** మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సునీత ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణిలో 11 దరఖాస్తులు భూ సమస్యలకు సంబంధించినవే వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హుస్సేన్, ఎంపీఓ వీరస్వామి, ఆర్ఐ సురేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: తహసీల్దార్‌కు దరఖాస్తు ఇస్తున్న రైతు



రేగొండలో..



కొత్తపల్లిగోరిలో..



మొగుళ్లపల్లి: దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ సునీత

### ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

**భూపాలపల్లి రూరల్:** భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2024 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మామిండ్ల రాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించి నగదును అందించారు. ఊరుగొండ సహిత్య 10 జీపీఏ సాధించగా ఆమెను, ఆమె తండ్రి ఊరుగొండ సుధాకర్‌ను శాలువాతో సన్మానించి రూ.5016, నగదును అందించారు. అదేవిధంగా 9.5 జీపీఏ సాధించిన ఊరుగొండ శ్లోకకు రూ.3016, మూడవ స్థానం సాధించిన సింధుకు రూ.2016ల నగదును అందించారు. నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులను ప్రోత్సహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురుజాల సంతోష్ రెడ్డిని కూడా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సుకుర్, కిసాన్ సెల్ అధ్యక్షులు గట్టు మహేందర్, గౌడ సంఘం అధ్యక్షులు పెరుమాండ్ల నవీన్, యూత్ నాయకులు మాడుగుల ప్రశాంత్,చెరుకు రాజు పాల్గొన్నారు.

### వైద్య సిబ్బందికి సన్మానం



డాక్టర్లను సన్మానిస్తున్న ఎంపీటీసీ పద్మనరేందర్

**చిట్యాల:** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీటీసీ కట్కూరి పద్మ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ జీడి తిరుపతి, మత్తు వైద్యుడు శ్రీకాంత్, గైనకాలజిస్ట్ విద్య, డ్యూటి డాక్టర్ అఖిలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీటీసీ పద్మ మాట్లాడుతూ.. వైద్యులు దేవుళ్లతో సమానం అని అన్నారు. వైద్యులు అంకితభావంతో పని చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్కూరి నరేందర్, హెడ్ సిస్టర్ విజయ కుమారి, ఫార్మసిస్ట్ నళిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు కొత్త రుణాలివ్వాలి

**మహాముత్తారం:** స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రుణ పరిమితిని పెంచి రైతులకు కొత్తరుణాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద నిరసన తెలిపి బ్యాంక్ మేనేజర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రణమాఫీ చేస్తానని ప్రకటించడంతో రైతులు పాత రుణాలు కట్టకపోవడంతో బ్యాంక్‌లు కొత్త రుణాలు ఇవ్వడంలేదని అన్నారు. పాత బకాయిలకు సంబంధం లేకుండా రైతులకు కొత్త రుణాలు అందజేయాలన్నారు. ఈ సంవత్సరం బ్యాంక్ రుణాలు రాకపోవడంతో రైతులు ప్రైవేట్ రుణాలపై ఆధారపడి అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని ఆరోపించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేస్తూ కొత్తరుణాలు అందజేయాలని ప్రభుత్వాని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాదాపు మల్లయ్య, నాయకులు గోపి, గుండు గున్నక్క, శ్రీష్ణస్వామి, శ్రీను పాల్గొన్నారు.

## మైసమ్మ గుడి నిర్మాణానికి విరాళం

**భూపాలపల్లి రూరల్:** జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి మీద ఉన్న దారి మైసమ్మ గుడి నిర్మాణానికి భూపాలపల్లి రజక సంఘం అర్బన్ అధ్యక్షుడు వైనాల శోభన్‌బాబు ఆధ్వర్యంలో సంఘం నాయకులు రూ.50వేల నగదును అందించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రధాన రహదారి మీద ఉన్న గుడి నిర్మాణం కోసం సంఘం తరపున నగదును అందించామని త్వరలో మరో రూ.50 వేలు కూడా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయల కమిటీ అధ్యక్షుడు క్యాతరాజు సతీష్, గోపరాజు రాజు, వైనాల కుమార్, చలకాని రమేష్, వావిళ్ల స్వామి, ఉప్పుల సారయ్య, డాక్టర్ రమేష్, తిరుపతితో పాటు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న రజక సంఘం నాయకులు

## కిరాణా షాపులో నగదు చోరీ

**కాళేశ్వరం:** మహదేవపూర్ మండలం కాళేశ్వరం బస్టాండ్ ఎదుట మధు కిరాణంలో చోరీ జరిగింది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కిరాణ వ్యాపారి గందెసిరి మధుసూదన్ దుకాణం నుంచి ఇంట్లోకి వెళ్లాడు. కిరాణవ్యాపారి వచ్చేసరికి రూ.20వేలపై నగదును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించి తీసుకువెళ్లాడు. కిరాణంలోని సీసీటీవి కెమెరాల్లో దొంగిలిచిన వ్యక్తి ఫొటో, వీడియోలు నిక్షిప్తం అయ్యాయి. ఆ దొంగిలించిన గుర్తు తెలియని మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా ప్రాథమికంగా గుర్తించారు. కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.



సీసీకెమెరాకు చిక్కిన దొంగ

#### దొంగల బీభత్సం..

నాలుగు నెలల కిందట కాళేశ్వరంలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో కూడా రూ.50వేల విలువైన ఫోన్‌లు, కొంత నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ ఏడాది ఎప్రిల్ 22న బస్టాండ్ సమీపంలో కోటపల్లి మండల దేవులవాడకు చెందిన పడాల అనీల్‌కు చెందిన ఫ్యాషన్‌ప్రో బైక్‌ను దొంగిలించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి వచ్చే చిల్లర దొంగల పనేనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటి వరకు పోలీసులు ఎవరిని గుర్తించలేదని తెలిసింది. ఇక్కడికి రెండు రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు నిత్యం రాకపోకలు చేస్తుంటారు. ఎవరనేది గుర్తుపట్టరాకుండా ఉంటుంది. దీనికి తోడు పుణ్యక్షేత్రం కావడంతో నిత్యం భక్తులతో రోడ్లు రద్దీగా ఉంటుంది. టీ స్టాల్స్, బస్టాండ్, హోటళ్లు ఉన్న ప్రాంతంలో సీసీ కెమెరాలను చెక్ చేస్తే ఇంకా వివరాలు తెలియనున్నాయి. చోరీ జరిగిన విషయం తెలియడంతో గ్రామంతో పాటు చుట్టుపక్కల్లో భయాందోళనకు గురవుతున్నారు.

## కుక్కల దాడిలో గొర్రెలు మృతి

**టేకుమట్ల:** కుక్కల దాడిలో పలు గొర్రెలు మృతి చెందగా, పలు గొర్రెలకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ద్వారకపేటలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. బాధిత రైతు గాజు గట్టయ్య కథనం ప్రకారం మేత కోసం వెళ్లేందుకు గొర్రెలు, మేకలను ఒకే చోటికి చేర్చి అనారోగ్యంతో ఉన్న జీవాలకు మందులను తీసుకు రావడానికి సమీపంలోని ఓ ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలో జీవాల మందపై కుక్కలు దాడి చేశాయని, కుక్కల దాడిలో 20 గొర్రెలు, నాలుగు మేకలు మృత్యువాత పడగా, మరో పది జీవాలకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి వివేక్ సంఘటనా స్థలానికి చేరుకుని పశువైద్యురాలు శారద, గోపాలమిత్రలు మేకల కుమార్‌తో కలిసి తీవ్రంగా గాయపడ్డ జీవాలకు చికిత్సనందించారు. కాగా మృతి చెందిన జీవాల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని, నష్టపోయిన తనకు ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.



మృతి చెందిన గొర్రెలు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రేగొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**రేగొండ:** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన రైతుల మహాజన సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా, రుణమాఫీ అమలు జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులు 10 ఎకరాల్లోపు భూమి కలిగి ఉన్న వారికి మాత్రమే రైతు భరోసా అందేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. సాగు చేసుకునే రైతులతో పాటు, కౌలు రైతులకు రైతు భరోసా, రైతు బీమా అందివాలని కోరగా ఎమ్మెల్యే స్పందిస్తు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మి, జెడ్పీటీసీ సాయిని విజయ, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు కిష్టయ్య, ఉమేష్‌గౌడ్, ఓంప్రకాశ్, పున్నం రవి తదితరులు పాల్గొన్నారు.

#### విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**భూపాలపల్లి రూరల్:** వానాకాలం దృష్ట్యా ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశించారు. నియోజకవర్గంలోని విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈదురుగాలులకు చెట్లు విరగడం, స్తంభాలు పడిపోవడం, విద్యుత్ తీగలు తెగిపడడం లాంటి ఘటనల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమస్యల పట్ల వెంటనే స్పందించి పరిష్కరించాలని చెప్పారు. చిట్యాల మండలం బావుసింగ్‌పల్లిలో విద్యుత్ తీగ తగిలి ఎద్దు చనిపోయిన ఘటనపై చిట్యాల ఏఈపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధితుడు ఓదేలుకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన గీత కార్మికుడు తిరుపతి

**చిట్యాల:** గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని ముచినిపర్తి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముచినిపర్తి గ్రామానికి చెందిన మూల తిరుపతి అనే గీత కార్మికుడు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలైయ్యాడు. తోటి గీత కార్మికులు గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో తిరుపతిని హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా, గాయాలపాలైన గీతా కార్మికుడిని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు తడుక సుధాకర్, స్థానిక గౌడ సంఘం పెద్దలు పరామర్శించారు. ప్రభుత్వం అన్ని ఆదుకోవాలని కోరారు.

## దీక్షను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

**భూపాలపల్లి రూరల్:** ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జూలై 7న హైదరాబాద్‌లో ఇందిరపార్కు వద్ద ఎమ్మార్పీఎస్(టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ చేపడుతున్న దీక్షను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. జూలై 7 నాటికి ఉద్యమం ప్రారంభించి 30 సంవత్సరాలైన సందర్భంగా వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఇందిరాపార్కు వద్ద వంగపల్లి శ్రీనివాస్ మాదిగ దీక్షకు శ్రీకారం చుట్టారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో 10 సంవత్సరాల నుంచి పార్లమెంట్‌లో మెజారిటీ ఉండి వర్గీకరణ అంశాన్ని పక్కన పెట్టి మాదిగ జాతిని మభ్య పెట్టె ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకొని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్, అధికార ప్రతినిధి మేకల ఓంకార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శీలపాక హరీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

**భూపాలపల్లి అర్బన్:** జిల్లా కేంద్రంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి అందజేసినట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. దలంలోని సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న తాళ్లపల్లి లింగస్వామి, గురుకుంట్ల దేవేందర్, కరుణ రాజశేఖర్, తన్నీరు మాధవ, పడాల వినోద్‌లు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోర్టల్ సహాయంతో విచారణ చేపట్టి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లకు స్వాధీనం చేసుకోని బాధితులకు సోమవారం అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న పోలీసులు